క్లుప్తంగా

గ్యాస్ పైపులైన్ పరిసరాల్లో అప్రమత్తం



గెయిల్‌పై బుర్రకథ చెప్తున్న కళాకారులు

కరప: గ్యాస్ పైప్‌లైన్ వెళ్లే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాస్ (శివ) పేర్కొన్నారు. మండలం యండమూరులో మంగళవారం గెయిల్ ఇండియా ఏర్పాటు చేసిన గొర్రెల రాము, కృష్ణ సోదరుల బుర్రకథ కళాజాతాను ఆయన ప్రారంభించారు. సహజ వాయు పైపులైన్ల గురించి, వాటి రక్షణకు ఏర్పాటుచేసిన వాల్వులు, యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, చిహ్నాలపై అవగాహన కల్పిస్తూ మహాభారతంలోని ఉత్తర కల్యాణం కథను బుర్రకథ రూపంలో గానం చేశారు. పరిశుభ్రత, పారిశుధ్య పనులపై కూడా గొర్రెల రాము బుర్రకథ వినిపించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాదరావు

కరప: బాలికలు ఆత్మన్యూనత విడనాడి, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హెచ్‌ఎం బీఆర్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. స్టాఫ్ సెక్రటరీ ఐవీ ప్రసాదరావు మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం దిశా యాప్, డ్రాప్ ఎట్ హోం, మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిర్భయ, పోక్సో, గృహహింస నివారణ చట్టం, మహిళారిజర్వేషన్ వంటి సదుపాయలపై అందరూ అవగాహన కల్పించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎం.మాణిక్యాంబ, పి.భవాని, కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా మార్కండేయ జయంత్యుత్సవం



ఉత్సవంలో పాల్గొన్న పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘ కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘ కార్యాలయంలో మంగళవారం మార్కండేయ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు పొన్నగంటి సత్యనారాయణ, కార్యదర్శి పాడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఆర్జి సూర్యారావు, ఉపాధ్యక్షుడు కొల్లు వేంకటేశ్వరరావు , ఆర్గనైజింగ్ సెక్రటరీ పుప్పు వీరకుమార్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరీలో కీర్తనలు గానం చేస్తున్న అనాహిత, అపూర్వతో వాద్య బృందం

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు అనాహిత, అపూర్వలచే నిర్వహించిన గాత్ర కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో నాలుగు రోజులుగా 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం అనాహిత, అపూర్వ (చెన్నై) లచే నిర్వహించిన సంగీత గాత్ర కచేరి అలరించింది. వీరు ప్రముఖ వాగ్గేయకారులు త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ తదితరుల కీర్తనలు వివిధ రాగాలలో ఆలపించి శ్రోతలను అలరించారు. వీరికి వయోలిన్ విద్వాంసులు కె.వెంకట సుబ్రహ్మణ్యం, మృదంగ విద్వాంసులు బుర్రా శ్రీహరి, ఘటం ఎం.హరిబాబు చక్కని సంగీత సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఆర్‌వి రావు, భారతలక్ష్మి, ఎస్‌కెవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

అంతా సెపరేటు

- దేవుని సన్నిధిలోనే నిలువుదోపిడీ
- అధిక ధరలకు పూజా సామగ్రి విక్రయం
- అధికారుల హెచ్చరికలు బేఖాతరు



ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయిస్తున్న దుకాణం

బోట్‌క్లబ్: ఆలయాలకు వచ్చిన భక్తులు ఎంతో భక్తితో దేవునికి సమర్పించడానికి కొబ్బరికాయ, పూజా సామగ్రి కొనుగోలు చేస్తారు. భక్తిభావంతో వచ్చిన వారు అక్కడి బోర్డుపై రేట్లు చూసి బెంబేలెత్తాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. భక్తి సంగతి దేవుడెరుగు జేబు చిల్లు పూడ్చుకునేదెలా అంటూ సగటు భక్తుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బహిరంగ మార్కెట్‌లో కొబ్బరికాయ రూ.20 కాగా ఆలయాలు వద్ద కొబ్బరికాయ రూ.25 నుంచి రూ.30కి విక్రయిస్తున్నారు. ఇక పాల ప్యాకెట్ బయట రూ.10 కాగా అక్కడ రూ.15 విక్రయిస్తున్నారు. డజను అరటిపళ్లు బయట మార్కెట్‌లో రూ.40 దొరుకుతుంటే ఇక్కడ మాత్రం రూ.50 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇలా ఆవునెయ్యి, అభిషేక సామగ్రి ప్రతీదీ రూ.5 నుంచి రూ.10 ఎక్కువకు విక్రయించి దోచుకుంటున్నారు. పర్వదినాల్లో ఆలయాలకు ప్రతి రోజు 700 నుంచి 900 మంది భక్తులు వస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు పూజా సామగ్రితో పాటు పసుపు, కుంకుమ, హారతి కర్పూరం, పూజా వత్తులు కొనుగోలు చేస్తుంటారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా అధిక ధరలకు విక్రయిస్తూ స్వామివారి దగ్గరకు వెళ్లే ముందే నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక్కడ దేవాదాయశాఖ షాపు లీజుకు తీసుకున్నాం రూ.వేలల్లో అద్దెలు చెల్లిస్తున్నాం. ఇక్కడ రేట్లు ఇంతే అని చెప్తున్నారు. దేవుడి దగ్గరకు వచ్చినప్పుడు గొడవ ఎందుకని చాలా మంది భక్తులు మారు మాట్లాడకుండా పూజా సామగ్రి కొనుక్కుని దేవుని దర్శనానికి వెళ్లిపోతున్నారు. కాకినాడ నగరంలో దేవదాయశాఖ పరిధిలో 20కి పైగా ఆలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఆలయాల్లో ఈ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం బయట మార్కెట్ రేట్ల ప్రకారమే ఇక్కడ పూజా సామగ్రి విక్రయించాలని ఆలయ అధికారులు చెప్పినా వ్యాపారులు పెడచెవిని పెడుతున్నారు.

ఇక్కడ మరీ అధ్వానం

నగరంలో రామారావుపేట శివాలయం వద్ద దుకాణాల్లో అధిక రేట్లుకు పూజా సామాగ్రి విక్రయిస్తున్నారు. ఇక్కడ రెండు దుకాణాలు ఉన్నా ఒకటి మాత్రమే దేవదాయశాఖ పరిధిలో ఉన్న దుకాణం ఉంది. మిగిలిన దుకాణం బయట వ్యక్తులకు చెందిన దానిలో ఏర్పాటు చేసుకోవడంతో అక్కడ భక్తులు నుంచి అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయం వద్ద రేట్లు చూసి భక్తులు భయపడాల్సిందే. ఇక్కడ చిన్న ప్లాస్టిక్ గ్లాస్‌లోను, కవర్లలోను పాలు పోసి రూ.15 వసూళ్లు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సరైన సమాధానం మాత్రం రాదు. ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు దుకాణ యజమానిని మందలించినా వ్యాపారి ధోరణిలో మార్పు లేదు.



ఈ చిన్న గ్లాసు పాల ధర రూ.15

మరీ దారుణంగా ఉంది



ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో అభిషేకం నిర్వహించేందుకు పాలు కొనుగోలు చేశాం బయట మార్కెట్‌లో రూ.10 విక్రయించే పాలు ఇక్కడ రూ.15 వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించినా లాభం లేకపోయింది. ఇక్కడ ఇదే రేటు లేకుంటే వెళ్లిపోవచ్చుని సమాధానం చెబుతున్నారు.

గొల్లపల్లి శివ, భక్తుడు

ఎక్కువ రేట్లు వసూలు చేస్తే చర్యలు



దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో లీజు వేలం నిర్వహించేటప్పుడు నిబంధనలు ప్రకారం మార్కెట్ రేటుకు మాత్రమే పూజా సామగ్రి విక్రయించాలని నిబంధన ఉంది. నిబంధనలకు అతిక్రమించి అధిక రేట్లుకు విక్రయిస్తే సంబంధిత దుకాణ యజమాని లీజు రద్దు చేస్తాం.

దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్

వేళంగిలో అగ్నిప్రమాదం

- పాన్ షాప్, హోటలు దగ్ధం
- రూ.3 లక్షల ఆస్తినష్టం

కరప: మండలం వేళంగిలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో పాన్ షాప్, మరొక హోటలు దగ్ధం అయ్యాయి. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని ఏఎస్సై జి.ప్రసన్నకుమార్, వీఆర్వో సత్యవతి తహసీల్దార్ కార్యా లయానికి సమాచారం అందించారు. స్థానికులు, రెవెన్యూ అధికారులు తెలిపిన కథనం మేరకు... వేళంగి నుంచి సిరిపురం వెళ్లే జంక్షన్‌లో అదే గ్రామానికి చెందిన గుత్తుల శ్రీరాములు పాన్‌షాప్, హోటలు నిర్వహిస్తుంటాడు. హోటలు పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడటంతో మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పాన్‌షాపు, హోటల్ అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు స్పందించి పక్కనే ఉన్న తుల్యభాగ డ్రెయిన్‌లోని నీటితో మంటలను అదుపుచేసేలోగా ఫైరింజన్ వచ్చి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా అదుపుచేశారు. బాధితులకు సాయం అందించేందుకు రెడ్‌క్రాస్ సంస్థకు తెలియజేస్తున్నట్టు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు.



వేళంగిలో దగ్ధమవుతున్న పాన్ షాపు, హోటల్

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



గడప గడపకూ మన ప్రభుత్వంలో పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎమ్మెల్యే ద్వారంపూడి
- 22వ డివిజన్‌లో గడప గడపకూ

కాకినాడ: నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 22వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న పలువురు నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు దూరంగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్న చరిత్ర ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ఇక్కడ అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పాలన తీరును దేశంలోని ఇతర రాష్ట్రాలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో ఉంటే అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండగలరన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, నగర పాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలు, రైతుల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వాకాడలో గడప గడపకూ



వాకాడలో వృద్ధురాలికి దగ్గరుండి వైద్యపరీక్షలు చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రతి కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చి, పేదలు, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వాకాడ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు, ప్రజలకు వివరించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, రామాలయాలు, వినాయక ఆలయాల్లో పూజలుచేశారు. ఏ గడప తట్టినా తాము ఏడెనిమిది పథకాల ద్వారా ప్రయోజనం పొందామని సంతృప్తి వ్యక్తం చేయడం గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, సున్నా వడ్డీ పథకాల ద్వారా రైతు దూడల లక్ష్మీపతిరావుకు రూ 9.38 లక్షలు, లకమన రాజబాబుకు రూ.5.30 లక్షలు, మరో రైతుకు రూ.7లక్షలు వచ్చాయంటే ముఖ్యమంత్రి జగన్ అమలుచేస్తున్న పథకాలే కారణమన్నారు. కొన్ని ఆ ప్రాంతాల్లో పలు సమస్యలు ప్రస్తావించగా ప్రాధాన్య క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. వాకాడ-కూరాడ గ్రామాలను కలిపే లింకు రోడ్డు నిర్మాణంలో ఉందన్నారు. ఎమ్మెల్యే కన్నబాబును, సర్పంచ్ అడబాల సత్యప్రసాద్, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, అడబాల బుచ్చిబాబు, ఈశ్వరరావు తదితర నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ముందుకు సాగారు. ఆయాసంతో బాధపడుతున్న వృద్ధురాలు గన్నెమ్మను ఎమ్మెల్యే కన్నబాబు చూసి వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్యను పిలిచి, వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, గోపిశెట్టి బాబ్జీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీసభ్యులు, పార్టీనాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రావెల్ మాఫియా

- తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- వనమాడి తీరుపై ద్వారంపూడి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. చిత్రంలో కొడ చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: తెలుగుదేశం హయాంలో గ్రావెల్ ఫొటోలను చూపిస్తూ తన ప్రమేయంతో రూ.కోట్ల అవినీతి జరిగిందంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన ఆరోపణలపై సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఫైర్ అయ్యారు. 2014–19 మధ్య ఒక్క బక్కెట్ మట్టి కూడా తరలించలేదని అప్పటి హోంమంత్రి, ప్రస్తుత పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో చెప్పించే దమ్ముందా? అని ద్వారంపూడి నిలదీశారు. రాజప్ప హయాంలో జరిగిన రూ.కోట్ల విలువైన గ్రావెల్ దోపిడీ రాష్ట్రమంతా తెలిసిందేనన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు విలేకర్ల సమావేశంలో ద్వారంపూడి మాట్లాడుతూ వనమాడి ఆరోపణలపై మండిపడ్డారు. రాజప్ప మాట్లాడితే తాను సమాధానం చెప్పేందుకు రికార్డులతో సిద్ధంగా ఉన్నానని ద్వారంపూడి పేర్కొన్నారు. సుమారు 350 ఎకరాల కొమరగిరి లేఅవుట్‌ను చదును చేసేందుకు కరోనా సమయంలో ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకుని రేయింబవళ్లు పనిచేసి అక్కడ లెవెలింగ్ చేయించామన్నారు. ఆ పనుల వల్లే కొమరగిరిలో తొమ్మిది వేల ఇళ్లు నిర్మాణం అవుతున్నాయన్నారు. అప్పట్లో రైతుల ఆమోదంతోనే మట్టి తరలించారని, అందుకోసం ప్రభుత్వ ఖజానాకు రూ.3.85 కోట్లు జమ అయ్యాయన్నారు. ఈ వాస్తవాలను కప్పిపుచ్చి టీడీపీ హయాంలో జరిగిన గ్రావెల్ అక్రమాలను తమకు ఆపాదించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. కొండబాబు హయాంలో జరిగిన అవినీతిపై ఎన్నిసార్లు ధ్వజమెత్తినా నేటికీ సమాధానం ఇవ్వలేకపోయారన్నారు.

కొవ్వు తగ్గించుకునేందుకే పాదయాత్ర

చంద్రబాబు తనయుడు లోకేష్ చేస్తున్న పాదయాత్ర ప్రజల కోసం కాదని, కొవ్వు తగ్గించుకోవడానికేనని ఎమ్మెల్యే ద్వారంపూడి వ్యాఖ్యానించారు. లోకేష్ పాదయాత్రను చూసి వైఎస్సార్‌సీపీ ఉలిక్కిపడుతోందంటూ టీడీపీ చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ అసలు రాష్ట్రంలో పాదయాత్రలు చేసేంత సమస్యలు ఏమున్నాయని ప్రశ్నించారు. చంద్రబాబు వైఫల్యాలు, దోపిడీ, అవినీతి నేపథ్యంలో వైఎస్సార్, ప్రస్తుత సీఎం జగన్ ప్రజలకు భరోసాగా నిలిచేందుకు పాదయాత్రలు చేశారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని సీఎం జగన్ అమలు చేశారని, అలాంటప్పుడు పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి



కరపలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న అధికారులు, నాయకులు

కరప: మండల పరిధిలోని లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను చైతన్యపరచి ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈఈ పి.శ్రీనివాస్ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన నాయకులు, అధికారులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. గ్రామాల వారీగా లే అవుట్లు ఎన్ని, లబ్ధిదారులు, చేపట్టిన ఇళ్లనిర్మాణాలు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కర్రె స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



విద్యార్థినికి దంత పరీక్ష చేస్తున్న వైద్యుడు

బోట్‌క్లబ్: స్థానిక సంతచెరువు వద్ద ప్రభుత్వ పాఠశాల్లో కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్యులు వెదురుపాక సతీష్, సువర్ణరాజు, వెంకటపతి, స్వరూప్, అద్దాల సత్యనారాయణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు, పేస్ట్‌లు పంపిణీ చేశారు.

ద్విచక్ర వాహనాల వల్లే రోడ్డు ప్రమాదాలు



ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుకు విరాళం అందజేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ద్విచక్ర వాహనాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని ఎస్పీ రవీంద్రనాథ్ బాబు పేర్కొన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు మంగళవారం కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ అశ్రద్ధ, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ వాడకపోవడం వంటి వాటి వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రజలు, రహదారి భద్రతకు బాధ్యత వహించే వ్యవస్థల సహకారంతో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎస్‌రాజు పోలీసు అమరవీరుల బాలబాలికల విద్యాభ్యాస నిధులకు రూ.లక్ష, ఇటీవలే ప్రాణాలు కోల్పోయిన ఆర్‌టీఓ హోమ్‌గార్డు, డ్రైవర్ కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పలు ప్రైవేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించగా పలువురు రక్తదానం చేశారు. రహదారి భద్రతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా రవాణా శాఖాధికారి మోహన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీహరిప్రసాద్, జిల్లా వైద్యఖాధికారి రత్నప్రభ, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, ఆర్‌టీఓ సాయి ప్రసాద్, ఏంవీఐ హరినాథరెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మీకిరణ్, ఏఎంవీఐ చిన్నారావు, కళాజ్యోతి, గౌరీశంకర్, షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



హ్యాండ్‌బాల్ ఎంపికల్లో ప్రథమ స్థానం పొందిన ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల జట్టు

నాగమల్లితోట జంక్షన్: క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి పేర్కొన్నారు. మంగళవారం కళాశాల క్రీడామైదానంలో ఆదికవి నన్నయ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ ఉమెన్ అంతర్ కళాశాల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలను కళాశాల కరస్పాండెంట్ చిరంజీవినీ కుమారి ప్రారంభించారు. కళాశాల పీడీ సీహెచ్ అజ్జిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన ఎంపికల్లో నన్నయ వర్సిటీ పరిధిలో కళాశాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలో ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాల, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ ఐడియల్ డిగ్రీ కళాశాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించాయి. విజేతలకు చిరంజీవినీ కుమారి బహుమతులు అందజేశారు. కేరళ రాష్ట్రంలో త్వరలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ ఉమెన్ పోటీలకు 16 మందిని ఎంపిక చేయనున్నారు. యూనివర్శిటీ పరిశీలకునిగా బాల సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, ఎస్ వెంకటేశ్వరరావు, పీడీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికి కళలు దోహదం

పెద్దాపురం: మంచి సమాజాన్ని నిర్మించడానికి నాటకాలు ఎంతో దోహదం చేస్తాయని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, ఎంపీడీవో అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చంద్రమాంపల్లి సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి చతుర్థ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే మంగళవారం రాత్రి నాటిక పోటీలను ప్రారంభించారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గోందేశి రాజా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడుతూ గ్రామీణుల జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్త పరచారన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కేదారి నాగు, డి.క్రాంతికుమార్ కూడా ప్రసంగించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో నటశేఖర కృష్ణ, అబ్బిరెడ్డి వెంకట సూర్యనారాయణరెడ్డి కళాప్రాంగణాన్ని ప్రారంభించారు. విశాఖపట్నం ఉక్కునగరం 'గుడి ఎనక నా సామి' హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారిచే 'దా'రుణం ' నాటికలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి రాంబాబు, డాక్టర్ ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, కొమ్మిరెడ్డి బుజ్జి, ఇందన బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

దైవాన్ని మనసులో వెతకండి

పోటీల్లో భాగంగా విశాఖపట్నం ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారిచే సిగ్గ రచించిన బాలాజీ నాయక్ దర్శకత్వంలో 'గుడి ఎనక నా సామి' నాటికను ప్రదర్శించారు.

యాప్‌ల పేరుతో దా'రుణాలు'

టెక్నాలజీ అభివృద్ధి చెందాక లోన్ యాప్‌ల పేరుతో ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో, దానివల్ల ప్రజలు ఎంత అవస్థలు పడుతున్నారో పరమాత్ముని శివరాం రచించి, దర్శకత్వం వహించిన దా'రుణం' నాటికలో చూపించారు.